ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 33.0
కనిష్ఠం 24.4

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శనివారం 17 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590 (312.5050)	68,746	79,535
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.33 (3.78)	662.03	258.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.44 (44.84)	43,478	57,736

చికెన్ ధరలు | లైవ్ : రూ.105 | డ్రెస్ : రూ.152 | స్కిన్‌లెస్ : రూ.172

అన్నింటికీ ఆ నలుగురే



- 'సర్వే లీలలు ఎన్నెన్నో'
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై విశేష స్పందన
- ఫోన్లు చేసి సర్వే కష్టాలు ఏకరువు పెట్టిన భూయజమానులు
- ఎవరు సర్వేచేయించుకుంటే వారి కనుకూలంగా నివేదికలిస్తున్నారనే ఆరోపణలు
- అర్హత లేకున్నా సర్వే చేస్తానని ముడుపులు తీసుకున్న ఓ ఉద్యోగి
- జిల్లాలో చక్రం తిప్పుతున్న సీనియర్ సర్వేయర్, అతడి బృందం
- ప్రైవేట్ సర్వేలతో వివాదాలు

దేవరకొండ డివిజన్‌లో పనిచేసే ఒక సీనియర్ సర్వేయర్, మరో ముగ్గురు సర్వేయర్లనే జిల్లా స్థాయి అధికారులు వివాదాస్పద భూములు, పంచాయితీలున్న సర్వేలకు పంపుతున్నారని, దీంతో వారు ఆడిందేఆటగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ బృందాన్ని ముందుగా ఎవరు సంప్రదిస్తే, వారికే అనుకూలంగా సర్వే నివేదిక ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు సైతం వారికి అనుకూలంగా ఉంటుండడంతో బాధితులు చేసేదేమీలేక అడిగినంత ఇచ్చుకొని సర్వే చేయించుకుంటున్న పరిస్థితి జిల్లాలో ఉంది. జిల్లాలో 26మంది సర్వేయర్లు, ఇద్దరు డివిజన్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

జిల్లాలో భూముల సర్వేకు ముడుపులు భారీగా వసూలు చేస్తున్న విషయం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో శుక్రవారం ప్రచురితం కాగా, జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పలువురు రైతులు, భూయజమానులు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి వారి ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ముడుపులు తీసుకుని సర్వేలు చేయడమే గాక, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ప్రైవేట్ సర్వేయర్లను నియమించుకొని కొలతలు వేయిస్తున్నారని వాపోయారు. ఎఫ్‌లైన్, టిపన్ల ఆధారంగా కాకుండా సర్వేకు దరఖాస్తు చేసుకున్న వారికి అనుకూలంగా హద్దురాళ్లు పాతుతుండడంతో వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండుపర్యాయాలు రెండు రకాల నివేదికలు

చండూరు మండలం కొండాపురంలో ఇద్దరు రైతుల మధ్య సరిహద్దు పంచాయితీ ఉండగా, ఓ రైతు తన భూమిని తేల్చాలని సర్వేకు దరఖాస్తు చేసుకున్నాడు. మండల సర్వేయర్ కొలతలు వేసి దరఖాస్తుదారుడికి అనుకూలంగా నివేదిక ఇచ్చాడు. అది సరికాదని, తనకు అన్యాయం జరిగిందని ఇంకో రైతు జిల్లా సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకోగా, వారు అతడికి అనుకూలంగా నివేదిక ఇచ్చారు. ఇద్దరు సర్వేయర్లు రెండు రకాల నివేదికలు ఇవ్వడంతో రైతుల మధ్య వివాదం చెలరేగి పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. వివాదం కారణంగా ప్రస్తుతం ఆ భూమిని ఇద్దరు రైతులు సాగుచేయకుండా వదిలేశారు. ముడుపులు పుచ్చుకొని సర్వే నిర్వహించడం వల్లే వివాదం ముగియలేదని బాధితులు వాపోతున్నారు.

కట్టంగూరు మండలంలో ముడుపులిస్తే ఇష్టారీతిన సర్వేలు

కట్టంగూరు మండలంలోని పిట్టంపల్లికి చెందిన రెండు కుటుంబాల మధ్య భూవివాదం ఉంది. ఆరేళ్ల క్రితం ఓ కుటుంబం తమ భూమికి సరిహద్దు నిర్ణయించాలని దరఖాస్తు చేసుకోగా, అప్పటి సర్వేయర్ వారికి అనుకూలంగా ప్రత్యర్థి కుటుంబానికి చెందిన భూమిలో వీరి కొంతమేర కలిసిందని, దాన్ని విడగొట్టి సరిహద్దు నిర్ణయించడంతో పాటు, సర్టిఫికెట్ కూడా ఇచ్చాడు. అది తప్పుడు నివేదికగా పేర్కొంటూ ఇరు కుటుంబాల మధ్య వివాదం నడిచింది. అప్పట్లోనే సర్వేయర్ పెద్దమొత్తంలో ముడుపులు తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. రెండోవర్గం తాజాగా, తమ భూమిని నిర్ధారించాలని దరఖాస్తు చేసుకోగా, ఇటీవల బదిలీ అయిన సర్వేయర్, గత సర్వేయర్ నిర్ధారించిన హద్దులకు భిన్నంగా, పూర్వపు సరిహద్దులనే నిర్ణయించాడు. అయితే అతడు బదిలీ అవ్వడంతో నివేదిక ఇవ్వలేదు. దీంతో ఇరువర్గాల మధ్య ఈ వివాదం కొనసాగుతూనే ఉంది.

ప్రైవేట్ వ్యక్తులకు రికార్డులిచ్చి సర్వేలు చేయిస్తున్న వైనం

జిల్లాలో సర్వేయర్ల కొరత నెపంతో అధికారులు చేస్తున్న తప్పిదాలు రైతులకు శాపంగా మారాయి. పలుమండలాల్లో సర్వేకు దరఖాస్తుచేస్తే, సదరు సర్వేయర్ లేక ఇన్‌చార్జి సర్వేయర్ భూముల కొలత బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ప్రైవేట్ సర్వేయర్లు, ప్రభుత్వ సర్వేయర్లు కలిసి ముడుపులు ఇచ్చినవారికి అనుకూలంగా నివేదిక ఇస్తూ అందుకనుగుణంగా కొలతలు వేసి, హద్దులు నిర్ధారిస్తున్నారని దీంతో వివాదాలు చెలరేగుతున్నాయని పలువురు వాపోతున్నారు. ప్రధానంగా భూముల విలువ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది.

సర్వే చేసేందుకు అర్హత లేని ఉద్యోగి డబ్బు వసూలు

కట్టంగూరు మండలం పందనపల్లికి చెందిన ఓ రైతు తన భూమిలో అరెకరం తక్కువగా ఉందని, సరిహద్దు భూయజమానులతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా, సర్వే చేయించుకోవాలని నిర్ణయించారు. నల్లగొండ డివిజన్ కార్యాలయంలో సర్వే విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి ఈ భూమి సర్వేకు 22 ఎకరాలకు రూ.33వేలకు ఒప్పుకున్నాడు. 70శాతం సర్వే చేసి ఆ తర్వాత మిగిలిన సర్వే చేయకుండా వదిలేశాడు. దీంతో బాధిత రైతు ఎన్ని పర్యాయాలు వెంటపడినా స్పందించకపోగా, ఫోన్ చేస్తే దూషిస్తూ మాట్లాడుతున్నాడని రైతు వాపోయాడు. సర్వే చేసే అధికారం ఈ ఉద్యోగికి లేకున్నా, సర్వే విభాగంలో పనిచేస్తున్న కారణంతో ముడుపులు తీసుకున్నట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

● తిప్పర్తి మండలంలో ఏడాది కాలంలో సర్వేకు 91 దరఖాస్తులు రాగా, 42 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పెండింగ్ కారణమేంటని ఆరా తీస్తే ముడుపులివ్వపోవడంవల్లేనని రైతులు తెలిపారు. అధికారులు మాత్రం ఆన్‌లైన్‌లో భూముల వివరాలు లేవని, సర్వే కోసం వెళ్లినప్పుడు సరిహద్దు రైతులు అందుబాటులో ఉండడం లేదని కారణాలు చెబుతున్నారు.

● చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన వేలుపల్లి వెంకటేశ్వర్లు భూసర్వేకోసం మూడు పర్యాయాలు చలానా కట్టినా ఇప్పటివరకు సర్వే చేయలేదు. రెండేళ్ల క్రితం ఒకసారి, ఏడాది క్రితం ఒకసారి, తాజాగా రెండు నెలల క్రితం మూడోసారి మీ-సేవా కేంద్రంలో డబ్బు చెల్లించినా, ఏదో ఒక సాకు చెబుతున్నారని అతడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ మండలంలో మొత్తం 70 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. చేయి తడిపితే భూమి సర్వే చేస్తున్నారని, మీ-సేవా కేంద్రంలో ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకుంటే రెండు, మూడు మండలాల బాధ్యతలున్నాయని, తరువాత వస్తామని సర్వేయర్లు వాయిదాలు వేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

భూమాత పైలెట్‌ప్రాజెక్ట్‌పై కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి జానారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, ఆగస్టు 16 : రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో నూతనంగా తీసుకువచ్చిన భూమాత కార్యక్రమంపై కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలు సమీక్షించారు. శుక్రవారం స్థానిక విజయవిహార్ అతిథిగృహం బోర్డు రూంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సమీక్షా సమావేశం నిర్వహించారు. భూమాత కార్యక్రమ పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ఎంపిక చేయగా మండలంలోని పలు గ్రామాల్లో, తండాల్లో 10 రోజులుగా భూసర్వే నిర్వహిస్తున్నారు. ఎంతమేరకు సర్వే పూర్తయ్యింది. తండాల్లోని అటవీ భూముల్లో ఏమైనా అవకతవకలు ఉన్నాయా చర్చించినట్లు సమాచారం. సమీక్షకు మీడియాను అనుమతించకుండా రహస్యంగా నిర్వహించారు. అంతేకాకుండా వివరాలను మీడియాకు వెల్లడించకపోవడంతో అంత రహస్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, భూమాత కార్యక్రమం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రమణ్యం, ఎఫ్‌డీవో సంగీత, ఎఫ్ఆర్‌వో రాఘవేంద్ర, ఎస్ఎస్‌వో తహసీల్దార్లు జవహార్, దశరథ, సైదులు, అనిల్‌కుమార్, కృష్ణయ్య, డీటీ దండా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ టౌన్, ఆగస్టు 16: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి శిక్షణ పొందిన బృందాలన్నీ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల్లో దరఖాస్తులను పరిష్కరించాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మురళి, డీటీసీపీ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై ప్రజల్లో భయాందోళనలు కలిగించవద్దు

డెంగీ కేసులపై ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజల్లో భయాందోళనలు కలిగించవద్దని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు వచ్చినప్పుడు నిర్ధారణ కాకుండా డెంగీగా ప్రకటించవద్దన్నారు. డెంగీ పాజిటివ్ కేసులు వస్తే తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లేదా డీసీహెచ్ఎస్‌తో నిర్ధారణ చేసుకున్న తరువాతే ప్రకటించాలన్నారు. వైద్యం కోసం వచ్చిన రోగులకు బిల్లుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. వైద్యులు ఏ వైద్యం చేస్తున్నది, ఫీజు, ఆస్పత్రిలో కల్పిస్తున్న సౌకర్యాలు, అన్ని వివరాలు ప్రదర్శించాలన్నారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందరికీ కనపడేలా ప్రదర్శించాలన్నారు. అగ్ని ప్రమాద భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, అనవసరంగా సిజేరియన్ చేయవద్దన్నారు. జ్వరం కేసులపై ప్రతీ రోజు నివేదిక పంపించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, వైద్యులు పుల్లారావు, సుచరిత, గౌరీశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రుల రాక

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో నల్లగొండకు చేరుకొని ఎన్జీ కళాశాలలో నిర్వహించనున్న రైతుబడి అగ్రిషోలో పాల్గొంటారు. అనంతరం తిప్పర్తి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

• 8లో



శ్రావణమాసంలో రెండో శుక్రవారం సందర్భంగా నల్లగొండలోని సంతోషిమాతా ఆలయంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొన్న మహిళలు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

వానాకాలంలో వేసవిని తలపించేలా ఎండలు



మోత్కూరు, సూర్యాపేటటౌన్, నల్లగొండ, ఆగస్టు 16: వానాకాలం ప్రారంభమై రెండు మాసాలు గడిచింది. అయినా ఉక్కపోత తగ్గడం లేదు. పగలు ఎండ తీవ్రత, రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రస్తుత వానాకాలంలో ఉమ్మడి జిల్లాలో ఓ మోస్తరు వర్షాలే కురిశాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి వచ్చిన నీరంతా కృష్ణానది ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదే. కాగా, ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా చెరువులు, కుంటలు నిండనేలేదు. భారీ వర్షాలు లేకపోగా, ఉక్కపోత, ఎండలకు జనం తాళలేకపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ జలాశయం, మూసీ, పులిచింతల ప్రాజెక్టులు నిండాయి. సాగర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద రాగా, మూసీకి హైదరాబాద్ నగరం నుంచి వరద వచ్చి చేరడంతో అవి నిండాయి. యాదాద్రి జిల్లాలో చెరువులతోపాటు బిక్కేరు వాగులో చుక్క నీరు లేదు. జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 21 మి.మీ తక్కువగా వర్షపాతం నమోదైంది. జూన్‌లో వర్షాకాలం ప్రారంభం కాగా, ఇప్పటి వరకు అడపాదడపా మోస్తరు వర్షాలే తప్ప భారీ వర్షాలు లేవు. దీంతో వాతావరణం చల్లబడలేదు. నడి వానాకాలంలో ఎండ తీవ్రత అధికమైంది. ఐదారు రోజులకోసారి చినుకులు పడుతున్నాయి. చినుకులకు ముందు ఉక్కపోత ఉంటోంది. వేసవి కాలంలా శరీరమంతా చెమట ప్రజలను చిరాకు కలిగిస్తోంది. ఫ్యాన్లు తిరుగుతున్నా ఉపశమనం కలగడం లేదు. రాత్రివేళల్లో సైతం ఫ్యాన్‌గాలి సరిపోవడం లేదు. మరోవైపు దోమల బెడద ఎక్కువైంది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఏ చిన్న ఆస్పత్రికి వెళ్లినా పదుల సంఖ్యలో జ్వరపీడితులు ఉంటున్నారు. రోజూ సుమారు 30 నుంచి 40 మంది జ్వరంతో బాధపడేవారు వస్తున్నారని మోత్కూరులోని ఓ ప్రైవేట్ డాక్టర్ తెలిపారు. జ్వరం వచ్చిన వారిలో డెంగీ లక్షణాలు లేకున్నా ప్లేట్‌లెట్లు పడిపోతుండటంతో రోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇళ్లలో ఏసీ సౌకర్యం ఉన్నవారు ఉక్కపోత భరించలేక ఏసీ వినియోగిస్తే జలుబు, జ్వరాలు వస్తున్నాయంటున్నారు. వాతావరణ సమతుల్యత లోపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఎండల తీవ్రతకు వరి నాట్లు పుంజుకోవడం లేదు. వేసిన నాట్లు కూడా అక్కడక్కడా ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన ముసురుతో కొంతమేర పత్తి చేలు గట్టెక్కాయని రైతులు భావించినా, మళ్లీ వర్షాలు లేకపోవడంతో చేలు వాడు ముఖం పడుతున్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతంలో మెట్ట పంటలపై వర్షాభావం, ఎండల ప్రభావం కనిపిస్తోంది. భారీ వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో వరి సేద్యం ఇబ్బందిగా మారింది. బోర్లలో నీరు తగ్గి ఆగి ఆగిపోస్తున్నాయి. దీంతో ఐదెకరాలు నాటు పెడదామనుకున్నా రైతులు రెండెకరాలు కూడా నాట్లు వేయలేకపోయారు. ఫలితంగా నాన్ ఆయకట్టు ప్రాంతంలో వరిసేద్యం గణనీయంగా పడిపోయింది.

పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో నాలుగు రోజులుగా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జూలై నెలలో పక్కకు పడేసిన కూలర్లను ప్రజలు పగలు రాత్రి తేడా లేకుండా వినియోగిస్తున్నారు. ఏసీలకు అలవాటు పడినవారు వాటిని ఆన్‌చేస్తున్నారు. పగటి ఉష్ణోగ్రత 36 నుంచి 37 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. శుక్రవారం 33 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్ర 6.30 తరువాతే కాస్త వాతావరణం చల్లబడుతోంది. రాత్రి సమయంలో ఉక్కపోతతో సరేసరి. ఏసీలు, ఫ్యాన్లు వినియోగిస్తుండటంతో మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో 4,51,501 గృహజ్యోతి కనెక్షన్లు ఉండగా, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న వారు 2,10,528 మంది ఉన్నారు. ఫ్యాన్లు రోజంతా నడుస్తుండటంతో యూనిట్లు పెరిగి ఈ నెల విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



శీతలపానీయాలకు భలే గిరాకీ

ఎండ తీవ్రతతో శీతల పానీయాలకు భలే గిరాకీ పెరిగింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత వేసవి కాలంలో సుమారు 60 నుంచి 80 వరకు జ్యూస్ పాయింట్లు ఉండగా, వానాకాలం రావడంతో అందులో కొన్నింటిని తాత్కాలికంగా మూసివేశారు. ప్రస్తుతం 30 వరకు జిల్లా కేంద్రంలో జ్యూస్ పాయింట్లు నడుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా ఉక్కపోత, వేడి పెరగడంతో ప్రజలు జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో గతంలో కంటే ధర పెంచి వ్యాపారులు శీతలపానీయాలను విక్రయిస్తున్నారు. అంతేగాక సీజనల్ వ్యాధుల బారిన పడుతుండడంతో ప్రజలు శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. గతంలో కొబ్బరి బొండం రూ.30 ఉండగా, ప్రస్తుతం రూ.50 వరకు విక్రయిస్తున్నారు. అంతేగాక లీటర్ కొబ్బరి నీళ్లకు గతంలో రూ.150 నుంచి రూ.160 వరకు ధర ఉండగా, ప్రస్తుతం లీటర్ కొబ్బరి నీళ్ల రూ.200కు విక్రయిస్తున్నారు. అదేవిధంగా మార్కెట్‌లో పుచ్చకాయల విక్రయాలు పెరిగాయి. వీటి ధరను వ్యాపారులు పెంచి విక్రయిస్తున్నారు.

మహిళలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

● డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 16: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని, మహిళలపై చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి ఆయన మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ కుటుంబ పాలనలో మహిళలకు మంత్రి పదవులు దక్కలేదని, మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో మహిళలు అవమానాలకు గురయ్యారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ పార్టీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోకపోవడంతో పాటు పలుచోట్ల డిపాజిట్ కోల్పోయిన బీఆర్ఎస్‌కు ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. ఇప్పటికైనా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలన్నింటినీ అమలు చేస్తోందన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర సంక్షేమ పథకాలు అమలుచేస్తుండటంతో బీఆర్ఎస్ ఓర్వలేకపోయిందని, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, గాలి నాగరాజు, నాంపల్లి భాగ్య, నాగమణిరెడ్డి, పిల్లి యాదగిరి, పుట్ట రాకేష్, మామిడి కార్తిక్, కంచర్ల ఆనంద్‌రెడ్డి, పెరిక అంజయ్య, జంజిరాల గిరి, వడ్డేపల్లి కాశీరాం, రాకేష్, రంజిత్, ముజ్జు, సల్మాన్, సిద్దార్థ పాల్గొన్నారు.

రుణమాఫీ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

● హరీష్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలి ● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 16: రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీని అమలు చేసినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో లక్ష రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేశారని అన్నారు. చిన్న, చిన్న కారణాలతో రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులైన రైతులందరికీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీపై విమర్శలు చేసిన మాజీమంత్రి హరీష్‌రావుకు సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హరీష్‌రావు, కేటీఆర్‌లు కాంగ్రెస్ ప్రభుత్వంపై పసలేని విమర్శలు చేస్తున్నారని వారి మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలోలేరని అన్నారు. త్వరలోనే రైతుభరోసా పథకాన్ని ప్రవేశపెట్టి రెండు పంటలకు రుణాలు అందజేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తిచేయడమే లక్ష్యంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రెండేళ్లలో శ్రీశైలం సొరంగమార్గం, డిండి ప్రాజెక్టును పూర్తిచేసి జిల్లాలోని ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కాళేశ్వరం పేరుతో రూ.94వేల కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం నియోజకవర్గంలోని గాజుబేడం, చిన్నమునిగల్, రామునోనిబండా నూతన రిజర్వాయర్లు మంజూరుచేసి అదనంగా ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతుందన్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల నుంచి రెండువందల ఆసుపత్రిగా ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని మండల కేంద్రాలకు రూ.14. 50 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. ప్రతి సంవత్సరం నియోజకవర్గానికి 5వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అర్హత కలిగిన పేదలందరికీ రూ. 5లక్షల చొప్పున అందజేస్తామన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయకులు జాల నర్సింహారెడ్డి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, జాన్‌యాదవ్, వడ్త్య దేవేందర్ నాయక్, మారేపాకల సురేష్‌గౌడ్, ఎండీ.యూనుస్, గోవిందు, సర్వయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

యాదగిరిక్షేత్రంలో పవిత్రోత్సవాలు పరిసమాప్తి

● నేటి నుంచి ఆర్జిత సేవలు ప్రారంభం

భువనగిరి అర్బన్, ఆగస్టు 16: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో, పాతగుట్ట ఆలయంలో మూడు రోజులుగా కొనసాగిన పవిత్రోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. శుక్రవారం ఉదయం ప్రధానాలయంలో నిత్య కైంకర్యాల అనంతరం ఉత్సవమూర్తులను నవకలశాలతో స్నపన తిరుమంజనాలు చేసి ఆభరణాలతో అలంకరించి, ప్రత్యేకసేవలో తీర్చిదిద్దారు. ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలోని యాగశాల వద్దకు ఊరేగింపుగా తరలించి, హోమాది పూజలు చేపట్టారు. మహాపూర్ణాహుతి నిర్వహించారు. మహా కుంభకలశాన్ని పవిత్రీకరించిన 108నూలుపోగులతో తయారుచేసిన మాలలను అంతరాలయంలో మూలమూర్తులు, సువర్ణ ప్రతిష్ఠమూర్తులను అలంకరించారు. అనంతరం దివ్య విమాన గోపురంపై సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకబృందం పవిత్రమాలలు అలంకరించింది. వేద మంత్రాలతో పవిత్రీకరించిన సప్తవర్ణాలలో 108నూలు, పట్టుపోగులతో తయారు చేసిన పవిత్రమాలలను స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రోచ్ఛరణలతో అలంకరించడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు నల్లంథీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, అధికారులు పాల్గొన్నారు. నేటి నుంచి అర్జిత సేవలను పునఃప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకబృందం

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట కొండపై శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఊంజల్ సేవలో తీర్చిదిద్దారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధవిభాగాల నుంచి రూ.23,07,813 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా మరో రూ.10లక్షలు లీజులకు సంబంధించి ఆదాయం సమకూరిందని తెలిపారు.

ఉపాధి వేతనాలు వచ్చాయ్

● జూలై వరకు రూ.32.35 కోట్ల చెల్లింపు



మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 16: ఉపాధిహామీ పథకం కింద పనులకు హాజరైన కూలీలకు చెందిన పెండింగ్ వేతనాలు వచ్చాయి. మే నుంచి జూలై నెల వరకు వేతనాల చెల్లింపు ప్రక్రియ పలు కారణాలతో స్తంభించింది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో ఈ నెల 9వ తేదీన 'పది వారాలుగా .. పైసా ఇవ్వలే' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేసింది. దీంతో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఉన్న పెండింగ్ వేతనాలు చెల్లించారు. మే నుంచి జూలై నెలాఖరు వరకు రూ.32కోట్ల నిధులను విడుదల చేయగా, నల్లగొండ జిల్లాలోని కూలీలకు రూ. 14.55 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 11.32 కోట్లు, యాదాద్రిభువనగిరి జిల్లాలో రూ. 6.47కోట్ల పెండింగ్ వేతనాల చెల్లింపు ప్రక్రియ శుక్రవారం నాటికి పూర్తయింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ పథకం పనులకు వెళ్లిన కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమయ్యాయి. ఉపాధి వేతనాలు తమ ఖాతాలో జమకావడంతో కూలీలకు కొంతమేర ఆర్థికపరమైన ఊరట దక్కింది. మిగతా నిధులు సైతం త్వరలోనే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తెలిపారు.

మొత్తం వేతనాలు చెల్లిస్తాం

ఉపాధిహామీ పథకానికి ఈ ఏడాది విశేష ఆదరణ లభించింది. దీంతో వార్షిక బడ్జెట్‌లో 90 శాతం వరకు పనిదినాలు పూర్తయ్యాయి. పనులకు హాజరైన కూలీలకు పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ వారం ఈ- మస్టర్‌రోల్‌లో నమోదైన హాజరు పట్టిక వివరాలను ఎన్ఐసీ ద్వారా సీఆర్‌డీకి అప్‌లోడ్ చేశాం. త్వరలోనే పూర్తిస్థాయిలో వేతనాల చెల్లింపు ప్రక్రియ ముగుస్తుంది. కూలీలు ఎలాంటి అపోహలకు లోనవద్దు.

-శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో, నల్లగొండ

రాఖీ పంపాలా... ఆర్టీసీ కార్గో సర్వీసు ఉందిగా..

నల్లగొండ, మిర్యాలగూడటౌన్, ఆగస్టు 16: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీలను అందజేయనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజశేఖర్, ఆర్టీసీ డిపో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పీఎస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనురాగాన్ని ఆప్యాయతలను పంచుకొనేందుకు, సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పుకునేందుకు రాఖీలను పంపించడానికి ఆసక్తి ఉన్న వారు కార్గో బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. కార్గో బుకింగ్‌ల కోసం సెల్ నెంబర్లు 9154298690, 9154298693, 9154298694, 9154298695లను సంప్రదించి సంస్థ ఆదాయం పెరిగేందుకు సహకరించాలని కోరారు. నల్లగొండ రీజనల్ పరిధిలోని వివిధ గ్రామాలు, మండలాలు, పట్టణాలకు చెందిన సోదరులు, సోదరీమణులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దూర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న సోదరులు, సోదరీమణులు రాలేకపోతున్న వారికి రాఖీలతో పాటు స్వీట్ బాక్సులు, బహుమతులు, ఇతర సామగ్రిని వారి నివాసాలకు పంపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈ మేరకు ఆయా బస్‌స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎర్రకోటలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

● అభినందించిన బండి సంజయ్



ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న తెలంగాణ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఆఫీసర్ కోటయ్య

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 16: దేశ రాజధానిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్రానికి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లుగా రాష్ట్రంలోని నాలుగు విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న విద్యార్థులను తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించింది ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో సేవలందిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన 16 మంది వలంటీర్లను ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. వారితో పాటు ఎంజీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా సేవలందిస్తున్న నర్సింగ్ కోటయ్యను కంటింజెంట్ లీడర్‌గా ఎంపికయ్యారు. 16 మందితో కూడిన బృందంతో ఈ నెల 13న ఢిల్లీ వెళ్లి ఉత్సవాల్లో పాల్గొని శుక్రవారం రాష్ట్రానికి చేరుకుంది.

● స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ బృందాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభినందించారు. ఢిల్లీలోని తన నివాసానికి ఆహ్వానించి ఆతిథ్యమిచ్చినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య తెలిపారు. కేంద్రమంత్రి మనుసుక్ మాండవ్య కంటింజెంట్ లీడర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ప్రత్యేకంగా అభినందించి వలంటీర్లలో ఉత్సాహం నింపినట్లు కోటయ్య తెలిపారు.

● కృష్ణమ్మ రాకతో..

ఆయకట్టుకు ఊపిరి

- సాగు పనుల్లో బిజీగా రైతులు
- పెరిగిన భూగర్భ జలాలు
- వ్యవసాయ అనుబంధ రంగాలకు ఊతం



నీరు పారుతున్న ఎడమ ప్రధాన కాల్వ

మిర్యాలగూడ (వ్యవసాయం), ఆగస్టు 16: దశాబ్ద కాలంగా పచ్చని పంటలతో ధాన్యాగారంగా మారిన సాగర్ ఆయకట్టు ఒక్క ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో ఎడారిగా మారింది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. చుక్క నీటికోసం వెంపర్లాడాల్సిన దుస్థితి. అన్నదాతలు ఆర్థికంగా చితికిపోయారు. ఈ ఏడాది జూన్ నుంచే జల్లులు మినహా భారీవర్షాలు పడలేదు. దీంతో పంటల సాగుపై రైతులు ఆశ వదులుకొని నైరాశ్యంలో మునిగిపోయారు. కృష్ణా నదికి పైభాగంలో భారీ వర్షాలు పడటంతో వారం రోజుల వ్యవధిలో ఆయకట్టుకు నీటి విడుదల జరిగింది. కృష్ణమ్మ పరవళ్లతో నేల పులకరించింది. అన్నదాతలకు ఊపిరిపోసింది. పంటల సాగుకు ఆయకట్టు సమాయత్తం అవుతుంది.



కాల్వ ఆధారంగా పోసుకున్న నారు

వరి సాగు షురూ..

నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా లో 6.50లక్షల ఆయకట్టు ఉంది. సాగర్ నిండటంతో ఈ ఏడాది రెండు సీజన్లకు అవసరమయ్యే సాగునీరు ఉండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. రైతులు వరి సాగు పొలాలు దుక్కులు దున్ని, నారు మడులు పోసుకుని వరి నాట్లకు సిద్ధమవుతున్నారు. గతేడాది సాగర్ నీటి విడుదల లేకపోయినా బోరుబావుల ఆధారంగా సుమారు లక్షన్నర ఎకరాల్లో వరి సాగు చేశారు. కాల్వ నీటితో సాగు జరిగే భూములు పడావుగా మారాయి. ఏడాది పాటు పొలాలు బా గా ఆరిపోయి ఉండటంతో ఈ సారి పంటలు బాగా పండుతాయని వ్యవసాయ నిపుణులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికంగా వర్షాలు లేకపోయినా....

గత ఏడాది నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో ఆయకట్టులో భూగర్భజలాలు వంద అడుగులపైగా కిందికి వెళ్లిపోయాయి. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 91.3 మి.మీ కాగా 166 మి.మీ వర్షం కురిసింది. దీంతో 81.7 అధికంగా నమోదైనట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటి వరకు సరైన వర్షా లు పడలేదు. ఆయకట్టులో పెద్దవూర, అనుముల, నిడమనూరు, మిర్యాలగూడ ప్రాంతాల్లో అధికారులు చెబుతున్న గణాంకాల్లో సగం వర్షపాతం నమోదు కాకపోవడం విచారకరం. ఇప్పటివరకు ఏ చెరువు, కుంటలు, బావుల్లో చుక్కనీరు రాలేదని రైతులు వాపోతున్నారు. రైతులు వందలాది బోర్లు వేసి లక్షలాది రూపాయలు నష్టపోయి అప్పులపాలయ్యారు. కృష్ణాజలాల రాకతో ఆయకట్టు దృశ్యం మారిపోయింది. నెల రోజుల వ్యవధిలో చెరువులు బోరు బావుల్లో నీరు సమృద్ధిగా పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఆయకట్టులో నాటు వేసేందుకు పొలం దున్నుతున్న రైతు

వ్యవసాయ పనులతో సందడి

ఆయకట్టు ప్రాంతాల్లో పంటల సాగుకు అనుబంధంగా ఎన్నో రంగాలు వెలిశాయి. దశాబ్దకాలంగా ఈ ప్రాంతంలో వందల సంఖ్యలో ఎరువులు, విత్తన దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో మండల కేంద్రంలో సుమారు 20-30 వరకు దుకాణాలు ఉన్నాయి. గత ఏడాది నీటి విడుదల లేకపోవడంతో వ్యాపారాలు నడవక దుకాణదారులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. ప్రస్తుతం విత్తనాలు కొనుగోలుతో పాటు ఎరువులు, పురుగు మందులను రైతులు కొనుగోలు చేస్తుండటంతో దుకాణాల వద్ద సందడి నెలకొంది. వ్యవసాయ యంత్రాలు, పరికరాలు తయారు చేసే వెల్డింగ్ దుకాణాలతో పాటు, ట్రాక్టర్ మరమ్మతులు చేసే షెడ్లు, పరికరాలు విక్రయించే ఆటోమొబైల్ దుకాణాలు, కమ్మరి కొలిమిలకు కృష్ణమ్మ ఊపిరిపోసింది. ప్రస్తుతం ఆయకట్టులో వ్యవసాయ పనులతో సందడిగా మారింది.

పరికరాల పనిలో నిమగ్నమయ్యాం



ఏడాది నుంచి చేతిలో పని లేక చాలా ఇబ్బందులు పడ్డాం. సాగర్ కాల్వలకు నీటి విడుదల జరగడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ట్రాక్టర్లకు ఉపయోగించే నాగళ్లు, వీల్స్ తయారీ పనుల్లో నిమగ్నమయ్యాం. ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది.

- చరణ్, వెల్డింగ్ షాపు నిర్వాహకుడు, మిర్యాలగూడ

సాగర్ నీళ్లొస్తేనే ఉపాధి



సాగర్ నిండితేనే చేతి నిండా పనులు ఉంటా యి. ఈ ఏడాది ఆయకట్టుకు నీటి విడుదల చేయడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ట్రాక్టర్ల వినియోగం పెరిగింది. మరమ్మతుల పనుల్లో బిజీగా ఉన్నాం. పంటల నీటికి ఢోకా లేకపోవడంతో ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

- శ్రీలోజు జానకీరాములు, ట్రాక్టర్, మెకానిక్


నీటి విడుదలతో పంటల సాగు



గత ఏడాది వర్షాలు లేక బోర్లు వేసి లక్షల రూపాయలు నష్టం పోయాం. ఈ ఏడాది సాగర్ నిండి నీటి విడుదల చేయడంతో వరి సాగుకు సిద్ధమవుతున్నాం. స్థానికంగా వర్షాలు పడకపోయినా కాల్వ నీటితో భూగర్భజలాలు పెరుగుతాయి.

- సయ్యద్, రైతు, త్రిపురారం

సాగర్ 4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల



నాగార్జునసాగర్ 4 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 16: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.8070టీఎంసీలు) కాగా శ్రీశైలానికి ఎగువ నుంచి 1,06,419 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో శుక్రవారం సాయంత్రానికి 881.40 అడుగులుగా (195.6605టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 68,746 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 8,067 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 7,518 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,150 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 79,535 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 68,746 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి వరద శుక్రవారం సాయంత్రానికి 662.03 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46టీఎంసీల) అడుగులు కాగా ప్రస్తుతం 642.33(3.78టీఎంసీల) అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి, ఎడమ కాల్వలకు 258.39 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతలలో...

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యానికి చేరువలో ఉంది. గరిష్ఠ నీటిమట్టం 175అడుగులు(45.77టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 174.44అడుగులకు(44.84 టీఎంసీల) చేరింది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 43,478 క్యూసెక్కులు కాగా రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 2.5 మీటర్లు ఎత్తి 41,736 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ, నాలుగు యూనిట్ల ద్వారా 100 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 57,736 క్యూసెక్కులుగా ఉంది.



నిండుకుండలా పులిచింతల ప్రాజెక్టు

నేడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవల నిలిపివేత



నల్లగొండ జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

నల్లగొండ, మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 16: కోల్‌కతాలో ఈ నెల 9వ తేదీన పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్‌పై జరిగిన పాశవిక హత్య ఘటనకు నిరసనగా శనివారం అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అన్ని సేవలు నిలిపివేయనున్నట్లు ఐఎంఏ అధ్యక్షురాలు జి.అనితరాణి, ప్రధాన కార్యదర్శి ఆర్.రమేష్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్‌డాంగ్గే, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎల్.రమేష్ మిర్యాలగూడ ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జీవనజ్యోతి, డాక్టర్ సరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీన ఉదయం 6 నుంచి 18వ తేదీన ఉదయం 6 గంటల వరకు దేశవ్యాప్తంగా ఓపీ సేవలు నిలిపివేయడానికి నేషనల్ ఐఎంఏ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో నల్లగొండ అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇది ఒక వైద్యురాలిపై జరిగిన దాడి లాగానే కాకుండా ఓ స్త్రీమూర్తిపై జరిగిన దాడిగా మానవత్వంపై జరిగిన అమానుష దాడిగా భావిస్తున్నామన్నారు. కాగా నల్లగొండ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలకు చెందిన జూనియర్ డాక్టర్లు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కళాశాల నుంచి ర్యాలీని పలు కూడళ్లలో నిర్వహించి హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసిన ఐఎంఏ బృందం

జిల్లాలో ఇటీవల నూతనంగా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన పుట్ల శ్రీనివాస్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్రాంకు తరఫున డాక్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డాక్టర్లు అనితారాణి, పుల్లారావు, రమేష్, ప్రవీణ్, రాజేశ్వరి, అరుంధతి, వసంతకుమారి, సుచరిత, గౌరీశ్రీ, చంద్రమౌళి, రాంమనోహర్, ఈశ్వర్, వినయ్, వేణుగోపాల్‌రెడ్డి, కల్యాణచక్రవర్తి, రవి, శ్రీకాంత్ వర్మ, శశిధర్ ఉన్నారు.

యూరియా కోసం అన్నదాతల పరుగులు



యూరియా తీసుకువెళ్లేందుకు తెచ్చిన ఆటోలు

నిడమనూరు, ఆగస్టు 16: యూరియా కోసం అన్నదాతలు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిడమనూరు మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఎదుట శుక్రవారం యూరియా టోకెన్ల కోసం రైతులు ఎగబడ్డారు. వానాకాలం సీజన్‌లో మండలంలో వరి సాగు గణనీయంగా పెరగడంతో రైతుల అవసరాల మేరకు మార్కెట్‌లో యూరియా దొరకడం లేదు. ఎరువుల దుకాణాల్లోనూ యూరియా లభించడం లేదంటున్నారు. స్టాకు లేదని చెబుతూనే కొందరు దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పీఏసీఎస్ సొసైటీ ద్వారా 45 కిలోల బస్తాను రూ.266కు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు సొసైటీల వద్ద ట్రాక్టర్లు, ఆటోలతో నిరీక్షిస్తున్నారు. యూరియా నిల్వలు అవసరమైన మేరకు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని నిడమనూరు సొసైటీ బుచ్చాల జానయ్య తెలిపారు. అందరికీ యూరియా అందిస్తామని పేర్కొన్నారు.

భార్య హత్య కేసులో అరెస్టు

అనుమానంతోనే ఘాతుకం



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 16: కులాంతర వివాహం చేసుకున్న భార్యను చంపిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. చిలుకూరు మండల కేంద్రానికి చెందిన దాసోజు బ్రహ్మచారి 2014లో నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన సరితను కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. డోర్ల పాలిష్ పనులు చేసే బ్రహ్మచారి మద్యానికి అలవాటుపడ్డాడు. ఈవిషయంలో దంపతుల మధ్య గొడవలు జరిగాయి. దీంతో ఇద్దరు పిల్లలను సరిత కుటుంబ సభ్యులు తీసుకువెళ్లి పోషిస్తున్నారు. మూడేళ్ల కుమారుడు బ్రహ్మచారి-సరిత వద్ద ఉంటున్నాడు. సూర్యా పేటలోని శ్రీరాంనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని బ్రహ్మచారి దంపతులు నివసిస్తున్నారు. బ్రహ్మచారి డోర్ పాలిష్ పనులకు వెళుతుండగా, సరిత ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. కాగా, భార్య సరితపై భర్త బ్రహ్మచారికి అనుమానం మొదలైంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 14న ఉదయం కూడా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆగ్రహంతో బ్రహ్మచారి ఇంట్లో ఉన్న జీఐ వైరును సరిత మెడకు బిగించి హత్య చేశాడు. అనంతరం సరిత కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి కుటుంబ సభ్యుల సహకారంతో అంబులెన్స్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సరితను పరీక్షించిన వైద్యులు ఆస్పత్రికి తీసుకరాక ముందే మృతి చెందిందని తెలిపారు. దీంతో వెంటనే బ్రహ్మచారి అక్కడినుంచి పరారయ్యాడు. సరిత తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బ్రహ్మచారికి చిలుకూరులో అరెస్టు చేయగా, భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. బ్రహ్మచారిని సూర్యాపేట కోర్టులో హాజరుపరుస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విలేకరుల సమావేశంలో పట్టణ ఎస్ఐ ఎం.లింగయ్య, ఏఎస్ఐ మేకపోతుల శంకర్, అభిషేక్ ఉన్నారు.

వరలక్ష్మీ కరుణించు తల్లీ..

నార్కట్‌పల్లి, చింతపల్లి, దేవరకొండ, శాలిగౌరారం, కనగల్, చిట్యాలరూరల్, ఆగస్టు 16: శ్రావణ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలోని పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్రమైన శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం వల్ల సౌభాగ్యాన్ని పొందుతారని మహిళలు విశ్వసిస్తారు. పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలను నిర్వహించారు. మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలువురు తమ ఇళ్లల్లోనే వ్రతాలు చేసుకొని వాయినాలు ఇచ్చారు.

● నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుట్ట కింద పార్వతీమాత ఆలయంలోని మంటపంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలతో దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ఆచరింపజేశారు.

● చింతపల్లిలో మండలంలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన మాజీ సర్పంచ్ కొండూరి శ్రీదేవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లప్పుడూ సౌభాగ్యంగా ఉండాలని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

● దేవరకొండలో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వర స్వామి, అయ్యప్పస్వామి, షిర్డీ సాయిబాబా, శివాలయం, మద్దెలమ్మతల్లి, మార్కండేయ, కన్యకాపరమేశ్వరి దేవాలయాల్లో మహిళలు పూజలు చేశారు. మద్దెలమ్మ తల్లికి పట్టణానికి చెందిన రమ్య రమేష్ దంపతులు ఆరుతులాల వెండిని అందజేశారు.

● శాలిగౌరారం మండలంలోని పలు గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

● కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు భక్తులకు వరలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం అర్చకులు ఆలయంలో నిత్యారాధన, అష్టోత్తర పూజలు జరిపించారు.

● చిట్యాల మండలంలోని పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నేరడలోని సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీమహమ్మాయి శాంభవిదేవి ఆలయ బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. శాంభవిదేవి శ్రీ స్వర్ణకవచాలంకృత అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో పిల్లమర్రి లక్ష్మయ్య, ముశం శ్రీనివాస్, అర్చకులు పాండురంగాచార్యులు, పెండోట సత్యనారాయణ, శివకిరణ్ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో సామూహిక వ్రతాలు


నల్లగొండ తులసీనగర్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు


చిట్యాల మండలం నేరడలో వరలక్ష్మీ వ్రతం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఆలయాలపై దాడులను నిలిపివేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

దేవరకొండ, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులు, దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పగిళ్ల సాగర్ డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో ఘటనలను నిరసిస్తూ వీహెచ్‌పీ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో నిర్వహించిన బంద్ పాక్షికంగా సాగింది. పట్టణంలో విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు వ్యాపార దుకాణాలను పాక్షికంగా బంద్ చేయించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు గుండోజు రామకృష్ణ, తాటిశెట్టి సుదర్శన్, రాము, బీజేపీ నాయకులు కర్నాటి సురేష్, నర్సింహ, రాములు పాల్గొన్నారు.

పీఎస్‌ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి


ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 16: గ్రామాల అభివృద్ధితో పాటు పంచాయతీ కార్యదర్శుల సమస్యలను వెం టనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శు లు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో అప్పులు తీసుకొచ్చి మరీ పారిశుధ్య పనులు, ట్రాక్టర్ నిర్వహణ తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులు తమపై పని భారం పెంచుతూ ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణికి హా జరవుతున్నా తాము రోడ్లపై తిరుగుతున్నామని ఉన్నతాధికారులు హేళనగా మాట్లాడుతున్నారని అన్నారు. గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్న తమకు మెమోలు, సస్పెన్షన్‌లతో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఐలాపురం పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు లేకుండా చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాధవ్‌రెడ్డి, భవాని, యాదగిరి, రవీందర్, మహేష్ పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి


సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో రవి

కేతేపల్లి, ఆగస్టు 16: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వేను వేగవంతం చేయాలని ఆర్డీవో రవి అన్నారు. కేతేపల్లి మండలకేంద్రంలో జరుగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి చేస్తున్న సర్వే తీరు, సర్వే వేగంగా సాగడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం ఇచ్చి సర్వేకు వెళ్లాలని ఆయన సూచించారు. దీంతో సర్వే వేగవంతంగా సాగుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట కేతేపల్లి ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

మామిడాలలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తిప్పర్తి, ఆగస్టు 16: మండలంలోని మామిడాల గ్రామంలో విషజ్వరాలు విజృంభించడంతో శుక్రవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో నెల రోజులుగా ప్రతీ ఇంట్లో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని మా జీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ పాదూరి శ్రీనివాస్‌రెడ్డి మంత్రి కో మటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రి వైద్యులకు వైద్యశిబిరం నిర్వహించాలని ఆయన ఆదేశించారు. దీంతో శుక్రవారం ఉద యం గ్రామంలోని సబ్‌సెంటర్‌లో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రతీ ఒక్కరికి జ్వరంతో పాటు కాళ్లు, చేతులు భరించలేని విధంగా నొప్పులు ఉంటున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. బాధితుల పరిస్థితిని బట్టి వారి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సబ్ సెంటర్ వైద్యురాలు ఇందు, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

కోదండంరాంకు ఎమ్మెల్సీ ఇవ్వడంపై హర్షం

నల్లగొండటౌన్, ఆగస్టు 16: తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం సేవలను గుర్తించి ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై టీజేఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం దక్షిణ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ తోట నరసింహచారి హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని సంఘాలను ఏకం చేసి ఉద్యమాన్ని ముందుకు నడిపించిన వ్యక్తి కోదండరాం అని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన కీలక భూమిక పోషించారని అన్నారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందని అన్నారు.

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం

● ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, ఆగస్టు 16: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆయా మండల కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన వారు మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి అనేక సాకులు చూపి 50శాతం మంది రైతులకు కూడా మాఫీ చేయలేదన్నారు. రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీ్‌షరావు విసిరిన సవాలును నాడు స్వీకరించకుండా నేడు హరీ్‌షరావు రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం తగదని అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని రైతులందరికీ సుమారు రూ.31 వేల కోట్ల రూపాయల పంట రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ప్రమాణం చేసిన సీఎం అందులో రూ.9 వేల కోట్ల మేర కోత పెట్టాడని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రచార సభల్లో సోనియాగాంధీ జన్మదినమైన డిసెంబరు 9 నాటికి ఏకకాలంలో పంట రుణాన్ని మాఫీ చేస్తానని వాగ్దానం చేసింది మరిచారా అని ప్రశ్నించారు. ఏట్లో దూకాల్సింది హరీ్‌షరావు కాదని మాట తప్పినందుకు సీఎం రేవంత్‌రెడ్డి దూకాలని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి గతంలో తాను ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరితో పాటు, సొంత జిల్లా మహబూబ్‌నగర్ ఎంపీ సీట్లను గెలిపించుకోలేక పోయారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి కేటీఆర్ లాంటి గొప్ప వ్యక్తిపై నిందలు వేయడం సరికాదన్నారు. ఆయా సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎండి.షోయబ్, సాధినేని శ్రీనివాస్, ఫయాజ్, వినోద్ నాయక్, శివ, నార్కట్‌పల్లిలో యానాల అశోక్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, దుబ్బాక శ్రీధర్, కర్నాటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేకు ప్రజలు సహకరించాలి


కొండమల్లేపల్లి : గాజీనగర్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తిరుమలగిరి(సాగర్), చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి, కట్టంగూరు, చిట్యాలరూరల్, ఆగస్టు 16: జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టారు. ఫీవర్ సర్వేకు సహకరించాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. ఎవరికైనా జ్వరం ఉన్నట్లు గుర్తిస్తే చికిత్స అందించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. దోమలు కుట్టడం వల్ల వ్యాధులు ప్రబలుతాయని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. జ్వరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పిచ్చిమొక్కలు తొలగించాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా లీకేజీలను గుర్తించి అరికట్టాలని అన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని శీత్లా తండాలో వైద్యారోగ్య సిబ్బంది జ్వర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం కె.సరిత జ్వరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లిలో ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్నున్నట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. ప్రజలు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించి తగిన సమాచారం ఇవ్వాలని సూచించారు.

● పెద్దఅడిశర్లపల్లి ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు వారం రోజుల పాటు జ్వర సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. ఏఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్వాడీలతో కలిసి సర్వే నిర్వహించారు.

● కట్టంగూరులో ఎంపీడీవో ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలో ఫీవర్ సర్వేకు వచ్చిన వారికి గ్రామస్థులు ఆరోగ్య వివరాలు వెల్లడించాలని ఎంపీడీవో జయలక్ష్మి అన్నారు. సర్వేలు ఎవరైనా జ్వర బాధితులు ఉంటే అక్కడే పలు పరీక్షలను నిర్వహించాలని, డెంగ్యూ జ్వరంగా నిర్ధారణ అయితే తక్షణమే ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

ట్రైనీ డాక్టర్‌పై అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

● ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మిర్యాలగూడ, ఆగస్టు 16: కోల్‌కత్తాలోని ఆర్జికార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులోని అమరవీరుల స్తూపం వద్ద వివిధ ప్రజాసంఘాల నేతలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరిగే హింసను కుల, మత, వర్గాలకతీతంగా ఎదిరించాలని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రమేజాబీపై రక్షకభటులే పోలీస్‌స్టేషన్‌లో అత్యాచారానికి పాల్పడితే సామూహిక నిరసనతో రాష్ట్రం అట్టుడికి పోయిందన్నారు. ప్రజలు చైతన్యవంతమైనప్పుడే హింసను అడ్డుకోగలమన్నారు. స్త్రీని బానిసగా చూసే, చూపే సమాజాన్ని, సాహిత్య వ్యాప్తిని అడ్డుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, సామాజిక ఉద్యమ నాయకులు జాడిరాజు, డీటీఎఫ్ నాయకులు గణేష్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు బాలస్వామి, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు దశరథ నాయక్, తెలంగాణ కార్మిక సంఘం నాయకులు హఫీజ్, కిరణ్మయి, జేవీవీ నాయకులు కొండల్‌రెడ్డి, మౌజం, హుస్సేన్, ఖదర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కృషి : ఎమ్మెల్యే

మునుగోడు, ఆగస్టు 16: మునుగోడు నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల రహదారుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న పంచాయతీ రహదారుల అభివృద్ధి కోసం రోడ్డు నెట్‌వర్క్ రూపొందించాలని, రహదారులపై ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారుల స్థితిగతులు ఏ రకంగా ఉన్నాయి, వాటి అభివృద్ధి కోసం సమగ్రమైన ప్రణాళికతో ప్రతిపాదనలు చేయాలన్నా రు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 16: పట్టణంలోని పలువురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు క్లియోస్పోర్ట్స్ అకాడమీ వీసీ హర్ష తెలిపారు. పట్టణంలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన అఫాన్, మణికంఠ, జయంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం ఆదర్శనీయమన్నారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు కావలి వెంకన్న, మారబోయిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

చింతపల్లి, ఆగస్టు 16: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వేల కోట్లు దోపిడీ చేశారని అన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఉజ్జిని అంజల్‌రావు, పల్లపు లక్ష్మయ్య, మల్లోజు శేఖరాచారి, శంషుద్దీన్, నరసింహ, వీరయ్య పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్టు

● రూ. 5.20లక్షల విలువైన 50 సెల్‌ఫోన్ల స్వాధీనం : డీఎస్పీ శివరాంరెడ్డి

నకిరేకల్, ఆగస్టు 16: తెలంగా ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ర్టాల్లో సెల్‌ఫోన్లను దొంగతనం చేస్తున్న అంతర్ రా ష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన ట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన ముఠా వివరాలను వెల్లడించారు. నకిరేకల్ శివారులోని బాబాసాహెబ్‌గూడెం బస్టాప్ వద్ద వద్ద శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న నంబరు ప్లేటు లేని కారును ఆపారు. వారు అనుమానాస్పదంగా వ్యవహరించడతో కారును తనిఖీ చేయగా 50 సెల్‌ఫోన్లు ఉన్నాయి. అన్ని సెల్‌ఫోన్లు ఎక్కడివని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులు కారులో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఎరుకల కవాది దుర్గప్రసాద్, నాగనూరి రవికుమార్, కవాటి ప్రభాస్, బండా వెంకటేష్‌తో పాటుగా మరో ఇద్దరు మైనర్లను గట్టిగా ప్రశ్నించగా సెల్‌ఫోన్లను దొంగతనం చేశామని చెప్పడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దొంగల ముఠా ప్రయాణిస్తున్న కారులో తరలిస్తున్న సెల్‌ఫోన్ల విలువ సుమారు రూ.5.20లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఇదే దొంగల ముఠా ఈ నెల 12వ తేదీన రాత్రి నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో గల టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు కోలా సైదులును బెదిరించి అతని సెల్‌ఫోన్‌తో పాటుగా కొంత నగదును దొంగిలించి పరారయ్యాడు. ఈ ఘటనపై సైదులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాహనాల తనిఖీలో సెల్‌ఫోన్లను తరలిస్తూ పట్టుబడిన దొంగల ముఠా సైదులు సెల్‌ఫోన్‌ను, నగదును దొంగిలించినట్లుగా నిర్ధారించామని, పట్టుబడిన దొంగల ముఠాపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఇద్దరు మైనర్లను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ దొంగల ముఠాతో నుంచి ఉన్న ఎర్టీగా కారు, ఒక స్క్రూడ్రైవర్, 50 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన నకిరేకల్ సీఐ పి. రాజశేఖర్, ఎస్ఐ. గోపికృష్ణ, ఏఎస్ఐ జి. కృష్ణచారి, సిబ్బంది వై.వెంకటేశ్వర్లు, వి. సురేష్, కె. జనార్ధన్, బి. మధుకర్‌లను డీఎస్పీ అభినందించారు.

నేటి నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 16: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ శనివారం నుంచి చేపట్టనున్నట్లు మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణ పరిధిలో 14313 దరఖాస్తులు రాగా 1722 దరఖాస్తులు క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. మరో 4400 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసిన ప్లాట్ల యజమానులకు ఫోన్ సందేశం పంపిస్తున్నామని, దరఖాస్తుదారులందరూ సకాలంలో పరిష్కరించుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం...

మునుగోడురూరల్: మునుగోడు మండలంలోని ఇప్పర్తి గ్రామంలోని సీతా రామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా బూడిద లింగయ్యయాదవ్ ఎన్నికయ్యారు. చైర్మన్‌గా లింగయ్యయాదవ్, వైస్‌చైర్మన్‌గా పుల్కరం సైదులు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రమేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు డీఆర్‌డీవో పీడీ నాగిరెడ్డి మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు నిర్వహించారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 26 నుంచి ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ట్రస్మా అధ్యక్షుడు కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. గ్రాస్ గ్రౌండ్‌లో హర్డ్ టెన్నిస్ బాల్‌తో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లను ఈ నెల 25వ తేదీ సాయంత్రంలోగా నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8896921234 నెంబరును సంప్రదించాలన్నారు.

మునుగోడు: మునుగోడులో బీజేపీ మండల అధ్యక్షుడు పెంబర్ల జానయ్యయాదవ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతిని నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో వాజపేయి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వేణుకుమార్, బొడిగె అశోక్‌గౌడ్, నరేందర్‌గౌడ్, అక్కెనపల్లి సతీష్, ఏర్పుల క్రాంతికుమార్, శంకర్‌రెడ్డి, నరేష్, వెంకన్న పాల్గొన్నారు.

త్రిపురారం: బీజేపీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొనుగోటి హరీష్, ప్రధాన కార్యదర్శులుగా మెరుగు మహేష్, కొప్పు సోమయ్య ఉపాధ్యక్షులు రమేష్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, వసంత్ సభ్యులను ఎన్నుకున్నారు. బీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా గంగుల లింగయ్య, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వల్లపుదాసు హుస్సేన్, యువ మోర్చా మండల అధ్యక్షుడు క్రాంతికుమార్‌ను ఎన్నుకున్నారు.

చిట్యాల: ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాలలో జరిగిన ఫొటోగ్రాఫర్స్ మండల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ఆయన హాజరై మాట్లాడారు. నూతన అధ్యక్షుడిగా దేవనబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శిగా కూరాకుల సుధీర్ ప్రమాణస్వీకారం చేశారు.

నల్లగొండ: పదో తరగతి 2023-24 విద్యా సంవత్సరంలో గణితశాస్త్రం ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేసినందుకు జిల్లా ఉత్తమ అధికారి పురస్కార అవార్డు అందుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గణితశాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో డీఈవో భిక్షపతిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ ఫోరంరాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి సునీల్, డీసీఇబీ కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్, కృష్ణ, రాము, స్వామి, జనార్ధన్, అమరేందర్ పాల్గొన్నారు.

నల్లగొండ: ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్ష ఫీజును సెప్టెంబరు 9వ తేదీ లోగా మీ సేవాకేంద్రంలో చెల్లించాలని డీఈవో భిక్షపతి, జిల్లా కో- ఆర్డినేటర్ జె. జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు.

నల్లగొండ రూరల్: బీజేపీ నల్లగొండ మండల కార్యదర్శిగా వెలుగుపల్లి గ్రామానికి చెందిన చితపల్లి వెంకన్న ఎంపికయ్యారు.

నల్లగొండ రూరల్: సీపీఐ జిల్లా నిర్మాణ సమావేశం ఆగస్టు 17న ఉదయం 10 గంటలకు జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు, సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డిలు హాజరుకానున్నట్లు తెలిపారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల పరిధిలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి శనివారం ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొండమల్లేపల్లి: మండలంలోని చిన్నఅడిశర్లపల్లి ప్రాథమిక పాఠశాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గౌస్‌పాషా వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు.

నాగార్జునసాగర్: పెద్దవూర మండల ఎంఈవోగా తరి రాము బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన బాలునాయక్ బదిలీపై నిడమనూరు, హాలియా మండలాలకు వెళ్లగా ఆయన స్థానంలో రాము బదిలీపై పెద్దవూరకు వచ్చారు.

చింతపల్లి: మండలంలోని వింజమూర్ గ్రామంలో ప్రజలు వర్షాలు కురవాలని కోరుతూ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు జలాభిషేకాలు నిర్వహించారు.

29 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

నకిరేకల్, ఆగస్టు 16: అక్రమంగా తరలిస్తున్న 29 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు. భువనగిరి మండలం లంపనాయక్ తండాకు చెందిన ధీరావత్ మధు, ధీరావత్ రాంబాబు అర్వపల్లి నుంచి నకిరేకల్ మీదుగా హైదరాబాద్‌కు ట్రాలీ ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆటోను, బియ్యాన్ని తమకు అప్పగించినట్లుగా డీటీ సీఎస్ జ్యోతి తెలిపారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిట్యాల, ఆగస్టు 6: చిట్యాలలో జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. చిట్యాలకు చెందిన రాందాస్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా తన ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్నాడు. అదేసమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాందాస్ రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. అంబులెన్స్ రాక ఆలస్యం కావడంతో ఆటోలో కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాలు అందలేదని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కేతేపల్లి, ఆగస్టు 16: మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులోని మూసీ నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు. మూసీ నదిలో కొట్టుకొచ్చినట్లుగా ఉందని మృతదేహం వివరాలు తెలియాల్సి ఉందన్నారు. దాదాపు 60 ఏళ్ల వయసు గల మృతుడు గ్రే కలర్ టీషర్టు, బ్లూ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని ఆయన తెలిపారు.